గాజు కిటికి

విందు ముగిసింది. అతిథులొక్కొక్కరే రామారావుగారి దగ్గర సెలవు తీసుకుంటున్నారు.

డాబామీద వెన్నెల్లో జరిగిన విందవడంవలన కాబోలు, అతిథులు వెళ్లిపోతూంటే, ప్రియురాలిని తెల్లవారుఝామున వదిలిపెట్టి ప్రియుడు వెళ్ళినప్పుడు ఆ యువతి మొహంలో తాండవించే తృప్త్యనురాగాల మధ్య ఒంటరితనంలా, ఆ విందు జరిగిన ప్రదేశంలో కాళీ, మెల్లగా ప్రవేశిస్తోంది.

అతిథులకు భోజన పదార్థాలు సుష్టుగా అమర్చబడ్డట్లు, టేబిల్లమీద ప్లేట్లలో మిగిలిన పదార్థాలను చూస్తేనే తెలుసుంది. ఆ డాబామీద నుంచి దూరంగా సముద్రం కన్పిస్తుంది ఊళ్ళో దూరంగా వెలుగుతున్న లైట్లూ కన్పిస్తాయి.

అటు పట్టణం యొక్క నాగరికతలో తళుకుబెళుకులూ, ఇటు ప్రకృతియొక్క గంభీరసౌందర్యం రెండు అందుబాటులోనే వుంటాయి. దేనిని కోరుకునే వ్యక్తి దానినిచూసి ఆనందించవచ్చు. నోటికందిచ్చిన అమృతమయమైన పదార్థాలనూ, కంటికి లభ్యమైన సుందరదృశ్యాలూ కూడా విస్మరించి, కబుర్లు కలబోసుకుని ఆనందించే బాతాఖానీ ప్రియులకు కూడా అది బ్రహ్మాండమైన విందే!

రామారావుగారు ఊళ్ళో పలుకుబడిగల వ్యాపారస్థుడు కాబట్టి, అతనిచ్చిన విందులో, పురప్రముఖులు చాలామంది పాల్గొన్నట్లు, ఆ డాబాముందు చీమల బారులా నిల్చిన కార్లే ప్రత్యక్షసాక్ష్యం. విందయ్యాక ఒకొక్కటే, అంబాసిడర్, డాడ్జి, చివర్‌లెట్, స్టాండర్డు, స్టూడీ బేకర్ మొదలైన రకరకాల కార్లు కదలి పోతూంటే, ధనికులలో కూడా ఇన్ని తరగతులా అని ఆశ్చర్యం వేస్తుంది. అటు కార్లు కదిలిపోతున్న ధ్వనిగాని, ఇటు సర్వర్‌లు టేబిళ్లను శుభ్రం చేస్తున్న శబ్దంగాని, దూరంలో సముద్రపు హోరులోని అవ్యక్త సంగీతంగాని, దగ్గరలో మైకు లోని పాటలుగాని, ఏవీ లెక్క చెయ్యదగినవి కానట్లు, ఇద్దరు వ్యక్తులు, డాబామీద ఒకమూల కుర్చీలలో కూర్చుని సర దాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళ మెదడులకు కావలసి నంత మేత దొరికింది. ఇతర్ల మీద చెప్పుకునే కబుర్లముందు ఎన్నిస్వీట్సతో చేసిన విందైనా దిగదుడుపే, వాళ్ళిద్దరకూ.

'నే చెప్పానా, వాళ్ళిద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గు మంటుందని.' అన్నాడు తన తెలివితేటలనేకాక పళ్ళని కూడా బయటపెడ్తూ వాళ్ళిద్దరిలో ఒకాయన; ఆయన పేరు శీనయ్య; వయస్సు ఏభై దాటింది; నల్లగా బొద్దుగా వుంటాడు, పంచె కట్టుకట్టి, నల్లకోటు తొడిగి, తలపాగా చుట్టి, నుదుట బొట్టు పెట్టే 'ఆర్థడాక్సు' ప్లీడరు ఆయన అజీర్ణ రోగంవల్ల విందులోని పదార్థాలనంతగా ఆరగించలేకపోయినా, విందుకు వచ్చిన

అతిథుల గురించి విషయాలు ముచ్చటించుకోవడంతోనే, అతనికీ, అతనితోటి వ్యక్తికీ కడుపు నిండిపోయింది.

'ఇంతకుముందు విన్నానుగాని, ఇద్దరిలోనూ అంతంత కావేషాలు పెరిగాయని ఎరుగను' అన్నాడు. సత్యంగారనే రెండవ వ్యక్తి ఆయన వయస్సుకూడా ఏభై దాటింది. బాగా ఆస్తివుంది; కోర్టు వ్యవహారాలంటే చెవికోసుకునే ఆసక్తివుంది; సన్నగా, ఎర్రగా వుంటాడు. గ్లాస్కో పంచెమీద సిల్కులాల్చీ వేస్తాడు.

'ఇంతా అంతా కాదు. జయరావుని ఎలా పడగొట్టాలా? అని శివరావు వెయ్యివిధాల ప్రయత్నిస్తూ. అహర్నిశలూ ఆలోచిస్తూంటాడు. శివరావుని ఎలా అణగ ద్రొక్కాలా? అని జయరావు చూస్తూంటాడు. వృత్తిలో పదేళ్ళనుంచీ వీళ్ళకి బలే పోటీగావుంది.'

'అసలు జయరావునుగురించి నాకంతగా తెలియదు కాని, చాలా గర్విష్టి అని విన్నాను' అని సత్యంగారు మరికొన్ని వివరాలకోసం ఎరవేశారు.

'అది గర్వంకాదులే, మనిషి మొత్తానికి మంచివాడే. చాలా పట్టుదలగలవాడు; కష్టపడికూడా పనిచేస్తాడు; వాళ్ల నాన్న పెద్ద ప్లీడరు. చాలాడబ్బు సంపాదించాడు ఆయన ఈ వూరు వచ్చేసరికి ఆయనకి ఈ కొడుకు వున్నాడుగాని భార్య లేదు. గిరిధర రావుగారు, కొడుకుని గారాబంగానేకాక మంచి

పద్ధతులలో పెంచాడు. ఆయనకు సాంప్రదాయం యందు ఎంతో గొప్ప గౌరవముంది. చనిపోయిన తనభార్య ఆత్మ ఏ మాత్రమూ దుఃఖించకుండా వుండాలని ఎంతో జాగ్రత్తగా మెసిలేవాడు. కొడుకు విపరీతమైన మాతృభక్తి కలిగి వుండే టట్లు పెంచాడు. జయరావు రోజూ కోర్టుకి వచ్చేముందు, తల్లి ఫోటోకి నమస్కరించి, ఆమె ఆశీర్వాదం పొందినట్లు వూహించు కుని మరీ బయల్దేరుతాడు.'

'అబ్బా! చెప్పుకోదగ్గ విషయమేమరి'

'అంతేకాదు, తన తల్లి ఆదర్శ స్త్రీ అనీ, తండ్రి ఆదర్శ పురుషుడనీ అతని నమ్మకం.'

సత్యంగారు మౌనంగా పరధ్యానంగా తలూపారు. శీనయ్య ఆయనవైపు చూశాడు ఏమిటాలోచిస్తున్నారన్నట్లు. రామారావుగారు చాలామంది అతిథుల్ని సాగనంపేసి, కొంత మంది సరదాగా పేకాడుకుందామంటే, అందుకు తగిన ఏర్పాటు చేయిస్తున్నారు. ఒక మూల ఆఖరి వరకూ వేచి వుండవలసిన సేవక బృందం యొక్క భోజనాలవుతున్నాయి. సత్యంగారు కొంచెం నిదానంగా, 'మరి శివరావు చరిత్ర ఏమిటి?' అని అడిగారు.

'మీకు తెలియదా? ఈ వూళ్లో చాలామందికి తెలుసునే ఆ విషయం'

'ఆ...అదే...ఎవరికో...పుట్టాడని...'

'ఎవరికో ఏమిటి, భోగందానికి పుట్టాడని. అందుకే శివరావు దగ్గరెవరైనా అతని తలిదండ్రుల విషయం ఎత్తుతే, ఛర్రుమంటాడు.'

'తల్లి ఎవరో తెల్సుగాని... తండ్రి ఎవరైనా కావచ్చు'

'అదా రహస్యం! అందుకే జయరావు అప్పుడప్పుడు 'రెస్పెక్టబుల్ ఫామిలీ' అని ఛెణుకులు విసరడం దానికి శివరావు మండి పడడం జరిగింది విందులో.'

'శివరావు అంటే జయరావు చూపించే నిరసనా శివరావు కళ్ళల్లో జయరావు వైపు చూసినప్పుడు మండే మంటలూ, వాళ్ళలోని మనస్పర్థల్ని చాటి చెప్తూనే వున్నాయి.'

'అంతేకాదు, శివరావు, కొంతమంది ముందర జయరావు అంతు చూస్తానని ప్రతిజ్ఞ చేసాడు. అతనొక రౌడీలా వుండే వాడు చిన్నతనంలో. ఇప్పటికీ మనిషి వస్తాదులాగ వుంటాడు. మొహంలో క్రూరత్వం వుట్టిపడుతూ వుంటుంది ఆ వుంగరాల జుట్టే లేకపోతే, ఆ నల్లని పొడుగాటి విగ్రహం చూసి, పగలే చంటిపిల్లలు జడుసుకుంటారు.' అని శీనయ్య అన్నాడు.

'జయరావులో నాజూకుతనం, దర్జాఉట్టి పడుతుంటాయి. పచ్చని పండు తమలపాకు లాంటి శరీరచ్ఛాయా, సన్ననిమనిషీ, అతని మాటలలోని సౌమ్యం, నడతలోని సౌజన్యం ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తాయి అందుకే అతను అంతత్వరగా పబ్లిక్ ప్రాసిక్యూటరు అయ్యాడు. వయస్సు కూడా చిన్నదిలాగే వుంది.'

'ఆ ముప్పైఎనిమిది వుండచ్చు. శివరావుకి కూడా దగ్గర దగ్గర అంతే వుంటుంది.

ఇద్దరూ ఒకసారి తమ చుట్టూ పరిసరాలు పరిశీలించారు. పేకాటకు జోరుగా ప్రయత్నాలు సాగుతున్నాయి. వీళ్లిద్దరికి అందులో ఉత్సాహం అంతగా లేదు. క్రింద కార్లలో చాలా సంఖ్య తగ్గిపోయినా, ఇంకా కొన్ని అక్కడక్కడ వున్నాయి. రామారావుగారూ, పోలీసు సూపరెండెంటూ, మాట్లాడు కుంటూ డాబా మెట్లవద్ద నిల్చున్నారు.

ఆకాశంలో వెన్నెల, మనుషులలో ఇతరుల తప్పుల్ని ఎంచేటప్పుడు వివేకం పల్చబడ్డట్టు, క్రమంగా పల్చబడుతోంది.

'ఇవాళ జయరావు మాటలు శివరావుని బాగా కలవర పర్చాయి' అని సత్యంగారన్నారు.

'తల్లి వ్యభిచారైతే ఆ సంతానానికి సంఘంలో తగిన గౌరవం లభించదు అని జయరావు గట్టిగా వాదించాడు' అని శీనయ్యగారు అందించారు.

'ఆ మాటలు తన నుద్దేశించి అన్నవేనని గ్రహించి, శివరావు మొహంలో చూపించిన ఫీలింగ్సు' నే నెప్పటికీ మర్చిపోలేను. కళ్లు ఎరుపెక్కాయి. శరీరమంతా చిన్న వణుకు వచ్చింది. మొహంలో క్రోధం ఉట్టిపడ సాగింది ఆ ఆవేశంలో 'ప్రతి స్త్రీ పతివ్రత అని నమ్మడం ఎలా? ఆమె రహస్య వ్యవహారాలు ఇతరుల కెలా తెలుస్తాయి?' అని ఒక చిన్న లెక్చరు దంచాడు.'

'మొత్తానికి రామారావుగారు కలుగ జేసుకొనక పోతే వ్యవహారం చాలావరకూ వెళ్ళేదే. ఆయన శివరావుని ఏదో పనుందని మెల్లిగా అవతలికి తీసికెళ్ళి అతనిలో ఆ పుద్రేకం తగ్గేదాకా ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పి ఆ ధోరణినుంచి మళ్ళించాడు.'

'అవునవును' అన్నారు సత్యంగారు.

'అయినా జయరావుకి అంత అహంభావం పనికిరాదు. తన తలిదండ్రులు ఆదర్శమూర్తులైనంత మాత్రాన, ఇతరుల్ని అవమానించాలని ఎక్కడుంది? శివరావు తల్లి వ్యభిచారైతే పాపం అతనేం చెయ్యగలడు? బురదలో పుట్టినంత మాత్రాన తామరపువ్వు విలువతగ్గిందా'?

'అవునయ్యా, పునుగూ, కస్తూరీ మొదలైన సుగంధ ద్రవ్యాలు ఎక్కడనుంచి ఉద్భవించాయి. వాటి జన్మస్థానం నీచమైనంతమాత్రాన వాటికి గౌరవం తగ్గిందా?'

'అందులోనూ 'క్రాస్‌బ్రీడ్' వల్ల పుట్టినవాళ్ళు చాలా తెలివైన వాళ్ళవుతారంటారు. ఏమంటారు...అహ్హహ్హ' అని యిద్దరూ నవ్వుతున్నారు.

వాళ్ళ కబుర్లు అంతమయ్యేసరికి, ఊరునిండా అప్పులుచేసి పరారైన ఆసామిలా, చంద్రుడు ఆకాశంలో మాయమయ్యాడు డాబామీద నాలుగు ఈజీచైర్లమీద పేక ముక్కలు చకచకా పంచ బడుతున్నాయి. డాబామీద ఎలక్ట్రిక్ లైట్లు చుట్టూ చీకటిని మరింత స్పష్టం చేస్తున్నాయి.

ఇద్దరూ మెల్లిగా లేచి, రామారావుగారి వద్ద సెలవు తీసుకుని, బయట పడ్డారు. వాళ్ళ ఇళ్లు అక్కడికి దగ్గరే కాబట్టి నడిచే వెళ్ళదల్చారు. సత్యంగారు సిగరెట్టు మీద సిగరెట్టు వెలిగిస్తూనే వున్నారు. శీనయ్యగారికా దురలవాట్లు లేవు. ఇద్దరూ కొంతదూరం మౌనంగా నడిచాక శీనయ్య, వీళ్లిద్దరి మధ్యా స్పర్ధ ఇంకా పెరుగుతుంది. ఇద్దరిలో ఎవరో ఒకరు నాశనమయ్యేదాకా పూర్తిగా ఆగదు అన్నాడు.

సత్యంగారు మెల్లిగా, 'నా వుద్దేశంలో శివరావు గట్టి పన్నాగం పన్నుతాడు అన్నారు.

అవునవును శివరావు ఎలాగైనా ఉద్దండపిండం. ఎంతైనా 'క్రాస్‌బ్రీడు' కదూ. అద్భుతమైన తెలివితేటలుంటాయి. అహ్హహ్హ'. అని శీనయ్య నవ్వాడు.

'మరేమరే క్రాస్‌బ్రీడంటే మాటలా ?' అహ్హహ్హ' అని ఇద్దరూ నవ్వుకుంటూ, తమ ఇళ్ళవైపు నడకలు సాగించారు. చుట్టూ చీకట్లు వాళ్ళని మింగేశాయి. మనిషిని సంఘం అడుగడుగునా విమర్శించి సాధిస్తూనే వుంటుంది. సంఘంలోని విమర్శనాశాఖ కధిపతులు శీనయ్యా, సత్యం.

శివరావు మనస్సు పగబట్టిన త్రాచులా బుసకొట్టూ కాటేసే అవకాశంకోసం ఎదురు చూస్తోంది. జయరావుకీ తనకీ మధ్య స్పర్ధ పెరిగి అయిదారేళ్లవుతోంది. అవకాశం దొరికినప్పుడల్లా జయరావు తనని అవమానిస్తూనే వున్నాడు. తన

చదువుగురించిగాని, మరే విషయంగురించైన తన నవమానిస్తే, అంత బాధపడేవాడు కాడు. కాని తన పుట్టుకగురించి అవమానిస్తే అందుకేమీ జవాబివ్వలేని నిస్సహాయ స్థితిలోపడి విపరీతమైన మనోవేదనకు గురయ్యేవాడు.

తనపుట్టుక నీచమైనదని తనను నీచంగా చూస్తే తనేం చెయ్యగలడు ? తన తల్లిని తను ఎంచుకోలేడుగదా! తన తల్లి చేసినపనికి తనను సంఘం శిక్షిస్తేనూ, జయరావులాంటివాళ్లు అవమానిస్తేనూ తను తలవంచుకోవడం తప్ప ఏం చెయ్యగలడు ? తన తల్లి పేరు ఆవూళ్లో ప్రతివెధవ నోట్లోనూ నలగడమే! అది చెవిలో పడ్డప్పుడల్లా తేలు కుట్టినంత బాధపడేవాడు.

చిన్నతనంలో తననెవరైనా తల్లిగురించి ఎత్తిపొడిస్తే, వాళ్ళని చావగొట్టేవాడు, తోటిపిల్లలైతే. తన కండబలంతోనూ, పొగరుమోతు తనంతోనూ ఎదుటివాళ్ళనోరు మూయించాలని చూశాడు. కానీ పెద్దయినకొద్దీ, కేవలం గాడీజం లాభంలేదని, సంఘంమీద కసితీర్చుకోవడానికి న్యాయశాస్త్రం బాగా తెలియాలని, న్యాయశాస్త్రం అభ్యసించాడు. తను కాలేజీలో చదివినప్పుడూ, న్యాయవాదిగా పేరొందినప్పుడూ, అంతగా ఎవరూ తననవమానించాలని చూడలేదు. కొన్ని సంవత్సరాలు తను తిరిగిన వాతావరణంలో ఆ ప్రసక్తే రాలేదు.

వయసులో రక్తపు బలిమివల్ల అణిగివుండే రోగాలు వయసు మళ్లినవెంటనే బయటపడ్డట్లు, శివరావు కాస్త పేరుగల వకీలుగా వృద్ధిచెంద నారంభించేసరికి ప్రజలనోళ్ళలో అతని పాతచరిత్ర నలగసాగింది.

ఎప్పుడు ఎవరు పెట్టారో గాని అతనికి భోగం వకీలు అనే వాడుక పేరు కూడా వెలిసింది. కొత్తవాళ్ళూ, తెలియని వాళ్ళూ ఆ పేరు ఎందుకు వచ్చింది అని అడిగితే, వూళ్లో వాళ్లు, అతనొక భోగం దానికి పుట్టాడని, అందువల్ల అతనికా పేరు వచ్చిందనీ చెప్తారు. కానీ అవన్నీ అతని చెవిని ఎక్కువగా పడేవికావు. ఎందుకంటే, రెండు చేతులా డబ్బూ, మంచి పేరూ సంపాదిస్తూండడం వలన అతని ఎదుట అతన్ని కించపరిచే మాటలనడానికి ఎవరికీ సాహసం వుండేదికాదు.

ఆ పని జయరావు ప్రారంభించేసరికి, శివరావుకు ఒళ్ళు మండి పోయేది. జయరావు తనని చూసే చూపులో గౌరవం వుండేదికాదు. తనొక అంటరాని వాడన్నట్లు చూసేవాడు. దానికి మనసులో మథనపడి పోవడం తప్ప వేరే ఏమీ చెయ్యలేక పోయేవాడు.

ఒక రోజున బార్‌లో జయరావు ఎవరితోనో 'పిల్లలు సంసారికీ పుట్తారు. వ్యభిచారికీ పుట్తారు. కాని సంఘంలో ఇద్దరికీ ఒకే రకమైన స్థానం లభించదు. తల్లిదండ్రుల్ని బట్టే సంతానానికి గౌరవం లభిస్తుంది. మన కళ్ళముందే ఒక వ్యక్తి విషయం

చూస్తున్నాం. వీధిలో అతన్ని ఏ పేరుతో పిలుస్తున్నారో వింటే ఆ విషయం స్పష్టమౌతుంది.' అంటూంటే తను విన్నాడు. అంత ప్రత్యక్షంగా తనను అన్నందుకు వెంటనే జయరావును ఏద్దైనా చేసేద్దామన్నంత కోపం వచ్చింది గాని, కొద్దినిముషాలు అతికష్టం మీద తనను తాను అదుపులో పెట్టుకుని, తను ఏమైనా చేస్తే ఆనిందను స్వయంగా అంగీకరించి నట్లవుతుందని ఊరుకున్నాడు. ఒకరిద్దరు ఓరకంటితో తనను కనిపెట్టాండడం గమనించాడు. తను ఆ మాటలు విన్పించుకోనట్లు నటించాడు. కాని ఆ రాత్రంతా గుండెల్లో అశాంతి తిష్ట వేసుకుంది అతనికి.

ఎన్ని విధాల ఆలోచించినా తనను సంఘం ఈ విధంగా శిక్షించడం చాలా క్రూరంగా కన్పించింది. స్త్రీ మాతృమూర్తి అవడానికి ప్రకృతి కారణ భూతం. అందుకు సంఘం ఆమె సంతానం పైన ఆదరణ చూపించే బదులు ఆంక్షలు విధించి వాళ్ళల్లో హెచ్చుతగ్గుల్ని నిర్ణయించడం అమానుషం. తన తల్లి వ్యభిచారిణి కావడం ఆమెది తప్పే. కాని ఎలాంటి పరిస్థితు లలో ఆమె పతితురాలైందో విచారించే వారేరి? తన తల్లి తననెంత ప్రేమగానో చూసేది. తనేం కోరితే అది కొనిచ్చేది. తను ఎంత మారాం చేసినా భరించేది. అందరి తల్లులకన్నా తన తల్లే మంచిదనుకునే వాడు. తనామెను నానాభాధలూ పెట్టాడు. అయినా ఆమెలో ప్రేమ కించిత్తూ కొరవడలేదు. అటువంటి తల్లినీ ఆమెగన్న సంతానాన్నీ సంఘం హీనంగా చూస్తోందంటే, దానికి హృదయముందా?— అనిపిస్తుంది.

రెండు నెలల క్రితం నెల్లూరు వెళ్లిన రాయప్ప ఒక వింత వార్త మోసుకు వచ్చాడు. రాయప్ప శివరావు ఆంతరంగిక నౌకరు. పొడుగాటి మీసాలూ, గిరజాల జుట్టూ వస్తాదులా వుంటాడు.

ప్రొద్దునే కాఫీ, ఫలహారం పూర్తి చేసి ఆఫీసు రూములో కూర్చున్న శివరావు అది వినగానే దిగ్భ్రాంతుడయ్యాడు. రాయప్ప, 'అవును సార్! ఈ జయరావుగారి తల్లి బ్రతికే వుంది. నేను కొంత మందిని, డబ్బు ఆశ చూపించి, మరీ కనుక్కున్నాను. ముప్ఫైఏళ్ళ క్రిందట ఆ ప్రాంతాల్లో వుండిన వాళ్ళద్వారా తెలిసిన దేమంటే, గిరిధరరావుగారి భార్య. జయరావుగారి బాల్యంలోనే' భర్తను వదిలిపెట్టి ఎవడితోనో లేచిపోయింది. తరువాత ఆయన ఆ వూరు వదిలిపెట్టి, ఈ వూరు వచ్చి ప్రాక్టీసు పెట్టారు ఇక్కడివాళ్లెవరికీ ఈ సంగతి తెలియదు. జయరావు గారికసలే తెలియదు.' అన్నాడు.

'ఇది నిజమేనా ?' అని ఖంగారుగా కుర్చీలోంచి లేచాడు శివరావు.

'ఎందుకు బాబూ అ ఖంగారు ? ఎక్కడికి వెళ్తారు ?'

'పద, నెల్లూరుకి వెళ్దాం. ఈ విషయం నేనూ స్వయంగా కనుక్కుంటాను'

'అంత శ్రమ అక్కర్లేదు. అన్ని ఋజువులూ నేను సిద్ధం చేసుకునే వచ్చాను. ఆ మనిషి మీద ప్రస్తుతం మన వూళ్లోనే కేసు నడుస్తోంది.'

'ఏం కేసు ? ఎవరి మీద ?'

'ఈ మధ్య సలాం సాయెబు సారాకొట్టు దగ్గిర దొమ్మి జరిగింది చూశారూ. అందులో ఆ కొట్టు యజమానురాలి మీద కూడా కేసు పెట్టారూ, ఆ మనిషే జయరావు తల్లి.'

"ఛీ! ఛీ! సలాంసాయబు ఉంపుడుకత్తా ? పచ్చి అబద్ధం!"

"అబద్ధం కాదుసార్. ఆ మనిషి ఇద్దరు ముగ్గురు చేతులు మారి చివరకు అయిదేళ్ళక్రితం సలాంసాయెబు చేతిలో పడింది. లేచిపోయిన దానికి వీడూ వాడూ అన్న వివక్షత ఏమిటి ?'

'అయితే ఈ కేసు జయరావే నడిపిస్తాడు. మరో వారం రోజుల్లో విచారణ కొస్తుంది.'

'అవును సార్. జయరావుగారు క్రాస్ ఎక్జామినేషన్ మొదలెట్టేసరికి బండారం అంతా బయటపడ్తుంది'

నిప్పులు తొక్కిన కోతిలా శివరావు ఇటూ అటూ పచారు చెయ్యసాగాడు. శివరావు మనసులో ఏవేవో ఆలోచనలు పరిగెడుతూంటే, అంతలో ఒక్కసారి ఆనందంతో రాయప్పను కౌగలించుకుని, 'నువ్వు చెప్పిందే గనుక నిజమైతే మరి మనకి ఈ జయరావు పొగరణగించే అవకాశం దొరికినట్లే. నాకు నువ్వు మహోపకారంచేశావు.' అన్నాడు. తరువాత అతనిని వదిలి ఒక్క నిముషం ఆగి, 'కానీ, నేనిది నమ్మలేకుండా వున్నాను. ఇంత వైపరీత్యం వుంటుందా ? ఉన్నా ఈ విషయం ఇన్నాళ్ళుదాగి వుంటుందా ?' అని అడిగాడు.

రాయప్ప ‹అది ఆశ్చర్యమే సార్ కాని ఆయన ఆ వూరువదిలి వచ్చెయ్యటం వలన అక్కడివాళ్ళకు తరువాతేం జరిగిందో తెలియదు. ఇక్కడివాళ్ళకు ఈయన పూర్వ చరిత్ర తెలుసుకునే ఉద్దేశం కలుగలేదు. అందుకే కొడుకునికూడా, తల్లి చచ్చిపోయింది అన్న భ్రమలో పెంచాడు.’ అన్నాడు.

‹అవునవును. కానీ ఎంతమోసం! ఆ జయరావుగాడు తన చరిత్ర ఇంత అసహ్యమైనదని తెలుసుకోక, ఇతరులను వేళాకోళం చేస్తాడా ? సరేకాని! వాడిసంగతి నేను కనుక్కుంటాను. ఇంతటితో వాడి పరువు ప్రతిష్ఠలు గంగలో కలిసినట్లే. వాడికి తప్పకుండా ఈ శాస్తి జరుగవలసిందే.’ అని శివరావు తన మనసులోని అక్కసునంతా రాయప్పముందు వెళ్ళగక్కాడు.

ఆ క్షణంనుంచీ శివరావు తన పగ తీర్చుకోవటానికి తగిన ప్రయత్నాలు ప్రారంభించాడు. సలాం సాయెబు కొట్టుదగ్గిర జరిగిన దొమ్మితో ఎక్కువ సంబంధం లేకపోయినా వాళ్ళందరికీ సారాపోయించి దొమ్మికి పురిగొల్పిందని తాయారమ్మమీద నేరం మోపారు పోలీసువారు. తాయారమ్మకు తనకు సారా కొట్టు పెట్టినందుకు ఏదో జుల్మానా కోర్టువారు వేస్తారని తెలుసు. అది చెల్లించెయ్యడానికి సిద్ధంగానే వుంది. అది అప్పు డప్పుడు జరిగే విషయమే. సారాకొట్టు పెట్టడం, దొంగ వ్యాపారం చెయ్యడం, మొదలైనవాటిలో సిద్ధహస్తులైనవాళ్ళు అప్పుడప్పుడు పోలీసులు తమమీద కేసుపెట్టటం, ఏదోచిన్న జుల్మానాతో ఆ తతంగం పూర్తిచేసుకోవడంకూడా తమకు పరిపాటే. ఈసారికూడా ఈ కేసులో తాయారమ్మ పాత్రఅంతే.

కాని అంతమాత్రంతో ఊరుకుంటే శివరావు ప్లాను నెరవేరదు. కేసులో తాయారమ్మ పాత్ర కొంచెం హెచ్చు ప్రాముఖ్యత వహించాలి. క్రాస్ ఎక్జామినేషన్‌లో తాయారమ్మ పాతచరిత్ర బయటపడాలి. అదివిని బార్ బారంతా దిమ్మెర పోవాలి. ఆ క్షణంలో జయరావు మొహం తను చూడాలి. తరువాత ఊరు ఊరంతా జయరావు తల్లిగురించి చెప్పుకోవాలి.

ఆ అపనింద భరించి జయరావు బ్రతుకగలడా ?

తాయారమ్మ అంతకు ముందుకూడా కోర్టెక్కింది. కాని అప్పుడు ఆమె గతచరిత్రను ఎవరూ ప్రశ్నించలేదు. ఆమె ఎవరితోనూ తనగురించి చెప్పుకోలేదు. అందుకే ఆ రహస్యం అలా వుండిపోయింది. ఆవిడకు వయస్సు ఏభై అయిదేళ్ళు మనిషి పచ్చగా లావుగావుంటుంది. శివరావు ఆమెను అంతకు ముందు ఒకసారిచూశాడు. ఆమె చాలా గంభీరంగా వుంటుంది. అంతగా ఎవరితోనూ మాట్లాడదు. అసలామెచేత ఆమె గత చరిత్ర చెప్పించడంకూడా అంత సులభం కాదు

రాయప్ప ఈ రహస్యం కనుక్కోడానికి చాలా కృషి చేశాడు అతనికి నెల్లూరులో ముప్పై ఏళ్ళక్రితం గిరిధరరావు గారనే వకీలు వుండేవాడనీ, అతని పడుచుభార్య ఎవరితోనో లేచిపోయిందనీ, తరువాత ఆయన ఆ వూళ్ళో మేడ నమ్మేసి, మరోవూరు వెళ్ళిపోయాడని తెలిసింది. ఆ గిరిధరరావే విశాఖ పట్నం వచ్చి అక్కడ స్థిరపడ్డాడనీ, అతనికొడుకే జయరావనీ

నిర్ధారణ చెయ్యడం అంత కష్ట మనిపించలేదు. కాని ఆ స్త్రీ తరువాతేమయిందో, ఎక్కడుందో, కనుక్కోవడానికి రాయప్ప చాలా కష్టపడ వలసి వచ్చింది. కొంత డబ్బు కూడా ఖర్చు పెట్టాడు. మొట్ట మొదట ఆ వూళ్ళో ఒక టైలరుతో లేచి పోయింది. అతనితో కొంతకాలం గడిపాక ఒక లారీ డ్రైవరుతో చాలా వూళ్లు తిరిగింది. ఆ లారీ డ్రైవర్ని ఎంతో శ్రమమీద కలుసుకుని, ఆమె ఆతనిని వదిలేసి ఒక అరవ వాడితో కలిసి రాజమండ్రిలో హోటలు పెట్టినట్లు తెలుసుకున్నాడు రాయప్ప.

ఆ హోటలు కొన్నాళ్ళునడిపి మళ్ళీ అకస్మాత్తుగా మాయమైంది. అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లిందో ఎవరికీ తెలియదు. తెలుసుకోవడానికి రాయప్ప రెండువారాలు చాలావూళ్లు తిరిగాడు. ఆఖరికి ఎలాగైతేనేం సలాంసాయెబు ఆమెను చేరదీసినట్లూ, వాళ్లిద్దరూ సారాకొట్టు పెట్టినట్లూ తెలుసు కున్నాడు. ఈ విషయాలన్నీ కోర్టులో బయుటపెట్టించే పరిస్థితులు కల్పించాలని శివరావు పథకం వేశాడు.

దానికి నాందిగా తాయారమ్మ తరఫున తను వకాల్తా పుచ్చుకున్నాడు ఫీజేమీ పుచ్చుకోనని ఆశపెట్టి మునుపు తేలిపోయినంత సులభంగా ఈ సారి కేసు తేలదనీ, ఈ సారి తాయారమ్మకు శిక్షపడే అవకాశం వుందనీ, బెదిరించసాగాడు. అందుకు తాయారమ్మ బెంగపడి పోలేదుగాని, ఎంతడబ్బు ఖర్చయినా, జైలు శిక్ష బదులు జరిమానా పడేటట్లు చూడమని అంది.

కోర్టులో చెప్పవలసిన విషయాలగురించి బోధపరచ డానికి తాయారమ్మను ఒకనాటి సాయంకాలం తన యింటికి పిలిపించాడు శివరావు.

రిక్షాదిగి శివరావు ఇంట్లో ప్రవేశించిన తాయారమ్మ, హాలులోని ఫోటోలలో ఒకదానినిచూసి గతుక్కుమంది. తరువాత రాయప్ప వచ్చి, శివరావు ఆఫీసుగదిలో వున్నాడని అక్కడికి తీసుకువెళ్ళాడు. ఆమెనుచూచి శివరావు, తన ఎదురు కుర్చీలో కూర్చోమని సంజ్ఞచేశాడు ఆమె కూచుంది.

'ఒక్క ముఖ్య విషయం చెప్పాలని పిలిపించాను. పోలీసు వాళ్లు నిన్నొక 'మర్డర్' కేసులో ఇరికించాలని చూస్తున్నారు'

'ఎలా ?' అని తెల్లబోతూ అడిగింది.

'అది చాలా రహస్యమైన విషయం. సుమారు ఎనిమిదేళ్ల క్రితం ఆ ప్రాంతంలో ఒక హత్య జరిగింది. కాని హంతకుడెవరో పట్టుబడలేదు. మొన్నటి దొమ్మి కేసులో అరెస్టుచేసిన కొంతమంది ద్వారా దానిసంగతులు కొన్ని బయట పడ్డాయి దానితో నీకెలాంటి సంబంధం లేనట్లు బుజువు చెయ్యడం అవసరం. నువ్వు సలా సాయెబును కలుసుకొని అయిదేళ్ళయింది కదూ ?'

'అవును'

'నీ భర్త లాయర్ గిరిధరరావు కదా ? నీది అసలు నెల్లూరు కదా? నువ్వాయనను వదిలేసావుకదా?' తాయారమ్మ జవాబివ్వలేదు. శివరావు ఆమె వంక చూశాడు.

'ఇవాళ కాకపోతే రేపైనా కోర్టులో జవాబివ్వాలి తప్పదు' అన్నాడు కఠినంగా.

'ఆయన పేరు కోర్టు కీడవడం నా కిష్టంలేదు'

'అయితే నువ్వు చిక్కుల్లో ఇరుక్కుంటావు' అని బెదిరించాడు.

కొద్దిసేపు వాదించింది గాని చివరకు, అవసరమైతే తన గతచరిత్ర కోర్టులో చెప్పేటందుకు అంగీకరించింది తాయారమ్మ అందుకు చాలా చింతిస్తున్నట్టు ఆమె మొహం చెప్తోంది.

శివరావు 'ఇక నువ్వు వెళ్ళవచ్చు' అన్నాడు. తాయారమ్మ లేచింది, వెళ్ళడాని కుద్యుక్తురాలై. మళ్ళీ ఆగి, 'ఇందాకా ఇటురాబోయి హాలులోకి వెళ్ళి ఒక స్త్రీ ఫోటో చూశాను ఆ ఫోటో ఫ్రేము తెల్లది. ఆ వ్యక్తి నాకు బాగా తెలుసు. ఆమె మీకేమైనా అవుతుందా ?' అంది.

'నీకెలా తెలుసు ?'

"మాది పాత పరిచయం ముప్పై ఏళ్ళకుపైగా గడచినా, నే నామెను మర్చిపోలేను. ఆమెను ఒక్కసారి చూడాలి. ఆమె లాటి పుణ్యాత్మురాల్ని ఒక్కసారి కలుసుకుని మాట్లాడితే నాకు కొంత మనశ్శాంతి కలుగుతుంది' అని నెమ్మదిగా అంది.

తన తల్లిని 'పుణ్యాత్మురాలు' అని ఒకరు మొదటి సారిగా జీవితంలో సంబోధించడం విని శివరావు దిగ్భ్రాంతు డయ్యాడు. 'ఆమె లేదు. చనిపోయి చాలా కాలమైంది'.

తాయారమ్మ కండ్ల వెంట నీళ్ళు గిర్రని తిరిగాయి. గద్గదస్వరంతో 'అయ్యో!' అంది ఆమెలో ఒక్కసారిగా ముసలితనం బయటపడ్డట్లయింది. మెల్లగా, వంగిన నడుంతో తలుపువైపు కదిలింది. కాని శివరావు, 'ఆమె గురించి నీకేం తెలుసు ?' అని అడిగాడు

కన్నీళ్ళు తుడుచుకుంటూ తాయారమ్మ 'అదొక విచిత్ర గాథ' అంది. అని, 'సరే ఇక ఆమెకూడా లేదన్నమాట' అని పైకి ఒకసారి చూసింది ఆమె చాలా బాధపడుతోందని గ్రహించిన శివరావు 'ఆమె నీకెలాపరిచయమో చెప్పలేదు' అన్నాడు.

"పోనీండి. ఇప్పుడా విషయాలు ఎందుకు ? అంది."

"చెప్పితీరాలి లేకపోతే నాకు శాంతి ఉండదు".

"ఆమె నేనూ చిన్నప్పటి స్నేహితురాళ్లం" అని శూన్యంలోకి చూస్తూ ప్రారంభించింది. "గిరిధరరావుగారు ఆమెను ప్రేమించి, వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. ఆమె కొక బిడ్డకూడా పుట్టాడు. ఆయన వివాహం నాతో జరిగిందిక్కానీ నన్నేనాడూ ఆయన ప్రేమగా చూడలేదు. ఆయన ఆమెతోనే కాలం గడిపేవారు. ఆమెను నేను మొదట్లో చాలా ద్వేషించేదాన్నిగాని తరువాత ఆమె చాలా ఉత్తమురాలని తెలుసుకున్నాను" అని ఆగింది.

"నువ్వు పొరబడ్డావు. ఆ ఫోటోలోని స్త్రీ ఒక పతిత" అన్నాడు శివరావు విచారంగా.

'కాదు. ఆమె నాకు బాగా గుర్తుంది. గిరిధరరావుగారి చేత మోసగింపబడ్డాక నెల్లూరు హాస్పిటల్‌లో ఒక మగబిడ్డను కని తరువాత ఈ ప్రాంతాలకే వెళ్లానని, ఇక్కడ తన బంధువు లెవరో వున్నారనీ చెప్పింది. ఆమె పేరు రంగమణి.'

ఈసారి శివరావు నిశ్చేష్టుడయ్యాడు. "పేరదేకాని, నాతల్లి వ్యభిచారి.' అని అరిచాడు గట్టిగా. ఆమె "పొరబడ్డారు. లోకం ఏమైనా అనుకోనిగాక. ఆమె వంచిత. లోకంలో అనేక అపవాదులు చెలరేగుగాక, ఆమె చాలా ఉత్తమురాలు. ఆమె పాదాలు సోకే అర్హతకూడా నాలాటి స్త్రీలకు లేదు' అంది ఆమె మొహంలో నిజం ప్రతిఫలింపజేస్తూ.

జీవితంలో తనతల్లిని ఎవరో పొగడడం మొదటిసారిగా వింటూన్న శివరావు ఉబ్బి తబ్బిబ్బవసాగాడు. పుట్టంధునికి, నడి వయస్సులో ఆపరేషన్‌చేసి డాక్టర్లు కళ్లు తెప్పిస్తే, అతనికి మొదట్లో కనిపించిన వెల్తురుకి కళ్ళు మిరుమిట్లు గొల్పుతాయి; క్రమంగా ఆ వెల్తురు కలవాటు పడ్డాక, ఆ ప్రపంచం, ఆకాశం, సూర్యోదయం, చంద్రుడూ, సముద్రాలూ మొదలైన దృశ్యాలూ మనుషులూ కన్పిస్తూంటే, ఆవ్యక్తి హృదయం ఆనందంతో గంతులేసినట్లు శివరావులో సంతోషం పొంగ సాగింది, ఆమె మాటలలో నమ్మకం కలిగాక.

ముని శాపంచేత రాయైపోయిన నాతి శ్రీరామపాద రజస్పర్శచేత మనిషిలా మారినప్పుడు ఆమెలో కలిగిన చైతన్యం లాటిది, శివరావు మనసులో కలిగింది.

ఆ ఉత్సాహంతో తాయారమ్మ చేతులుపట్టుకుని, "నువ్వు నా పాలిట దేవతవు. ప్రపంచం అంతా తెగనాడుతున్న నా తల్లిని మంచిదని అనుకున్నదానివి నువ్వొక్కర్తెవే కన్పిస్తున్నావు. నా తల్లి వ్యభిచారిణి అనీ, శరీరం అమ్ముకున్నదనీ అందరూ అనడం విన్నాను. కాని ఇంత చక్కనిమాటలు ఎప్పుడూ వినలేదు' అన్నాడు.

అతని [illegible] చూసి ఆమెలో జాలి కలిగింది. ఇద్దరూ [illegible]లులోకి వెళ్ళి ఆమె ఫోటో ముందు నిలబడ్డారు. తాయారమ్మ, 'స్త్రీ జీవితం బహు దుర్గమమైంది. అందులో ఏ మాత్రం లోపం జరిగినా లోకం ఇట్టే ఆమె మీద అపవాదులు వేస్తుంది. బహుశా ఆమె జన్మించిన కులంవల్లగానీ, ఆమెను ఇక్కడ ఆదరించిన వ్యక్తుల వలనగాని ఆ చెడ్డపేరు వచ్చి వుంటుంది. తన సర్వస్వం గిరిధరరావుగారికి అర్పించిన సాధ్వి ఆమె' అంది.

తన జీవితం ధన్యమైనట్లు తోచింది శివరావుకి.

మర్నాడు సాయంకాలం కోర్టునుంచి తిరిగిరాగానే రాయప్ప, శివరావు నడిగాడు.

'ఏం సార్ ? కేసంతా అలా తేల్చేశారు తాయారమ్మ చేత ఏమీ చెప్పించలేదు ?' అన్నాడు నిరుత్సాహ వదనంతో.

కోర్టు డ్రస్సు విప్పేసి మామూలు దుస్తులు వేసుకుని, రాయప్ప ఇచ్చిన కాఫీ కప్పు చేత్తో పట్టుకుని కుర్చీలో కూచున్నాడు శివరావు.

'రాయప్పా! ఇన్నాళ్లూ పగ సాధించడం గొప్పదనుకున్నాను గాని, అంతకన్నా క్షమ అనేది ఇంకా గొప్పదని ఇవాళ తెలుసుకున్నాను' అన్నాడు.

'అయితే జయరావుగారి సంగతి అంతేనా?' అని ఆశ్చర్యంతో అడిగాడు రాయప్ప.

'అతను గాజుకిటికీల వెనకాల నివసిస్తున్నాడు. ఏ నిముషంలో వాటిమీద ఎవరు రాయివేసినా అవి పగుల్తాయి. నాకుమాత్రం నా మనసులోని బాధ తీరిపోయింది. జయరావు మాటలకు బాధపడే అవసరం పోయింది' అని తల్లి ఫోటోవైపు చూశాడు.

కర్ణుణ్ణి సూతపుత్రుడు అని నిందించిన లోకాన్ని లెక్క చెయ్యక పోవడమేకాక, చివరిదాకా తను కుంతీపుత్రుణ్ణి అని ప్రకటించుకోక పోవడంలో ఎంత ఔదార్యం చూపించాడు కర్ణుడు!' అని శివరావు అంటూంటే రాయప్ప మౌనంగా తలూపాడు.

మహాభారత యుద్ధంలో కర్ణుడు ఆఖరి దశలో, తన రథచక్రాన్ని పైకెత్తబోతూ ఒరిగిపోతున్న దృశ్యం ఇద్దరి మనసులలోనూ మెదిలింది.